క్లుప్తంగా

'శ్మశానవాటికకు వెళ్లేందుకు కల్వర్టు నిర్మించండి'

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ కాలనీ నుంచి శ్మశానవాటికకు వెళ్లే దారిలో కల్వర్టును త్వరగా నిర్మించాలని సోమవారం కాలనీవాసులు నిరసన వ్యక్తం చేశారు. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం ఆరు నెలల క్రితం శ్మశానవాటికకు వెళ్లేందుకు కల్వర్టు నిర్మాణానికి పనులు ప్రారంభించారన్నారు. కల్వర్టు నిర్మాణం పూర్తయ్యేవరకు తాత్కాలికంగా దారి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

రహదారి కష్టాలపై డీటీడీవోకు వినతి

వాంకిడి: మండలంలోని ఎనోలి గ్రామానికి వెళ్లే రహదారి కష్టాలను వివరిస్తూ కొలాం సంఘం నాయకులు సోమవారం జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి రమాదేవికి ఆమె కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఐటీడీఏ నుంచి ఎనోలి గ్రామానికి నూతనంగా బీటీ రోడ్డు మంజూరు కాగా కొన్ని నెలల క్రితమే పనులు ప్రారంభించి పూర్తి చేయకుండానే వదిలేశారన్నారు. పనులను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వీటీడీఏ ప్రెసిడెంట్ పగ్గు, కొలాం సంఘం జిల్లా అధ్యక్షుడు జలపతిరావు, నాయకులు భీంరావు, గణేశ్ ఉన్నారు.

మొక్కల సంరక్షణ చేపట్టాలి

రెబ్బెన: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కల సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ఇన్చార్జి ఎఫ్ఆర్వో శ్రీధర్చారి అన్నారు. గోలేటిలో సోమవారం సేవాలాల్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. సెక్షన్ అధికారులు సతీశ్, కోమల్, మాజీ జెడ్పీటీసీ అజ్మీర బాబురావు, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, బలరాంనాయక్, దుప్పానాయక్, బీట్ అధికారులు రవి, అనిల్ పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

ఆసిఫాబాద్రూరల్: గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఏసీఎంవో ఉద్ధవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మూడు రోజులపాటు నిర్వహించిన వృత్యంతర శిక్షణ కార్యక్రమం సోమవారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులకు సబ్జెక్టుల వారీగా శిక్షణ అందించామన్నారు. ఏటీడీవో క్షేత్రయ్య, డీఎస్వో మీనారెడ్డి, హెచ్ఎం కృష్ణారావు పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా జిల్లా ఇన్చార్జిగా తిరుపతి

బెజ్జూర్: జిల్లా బీజేపీ దళిత మోర్చా ఇన్చార్జిగా బెజ్జూర్ మండలం సలుగుపల్లి(ఊట్ సారంగపల్లి)గ్రామానికి చెందిన కుమ్మరి తిరుపతిని నియమిస్తున్నట్లు భారతీయ జనతా పార్టీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ సోమవారం ప్రకటించారు. రెండోసారి జిల్లా ఇన్చార్జిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్తోపాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, క్రాంతి కిరణ్కు తిరుపతి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమ గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్రూరల్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని సోమవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్లో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా కార్యదర్శి దినకర్ మాట్లాడారు. జిల్లాలోని పది సాంఘిక సంక్షేమ గురుకులాల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్పుస్తకాలు, ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేయలేదని పేర్కొన్నారు. అధికారులు దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాయకులు రాజ్కుమార్, నగేశ్, మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగికి విరమణ సహజం

ఆసిఫాబాద్రూరల్: ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజమని డీఈవో అశోక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఒడ్డేపల్లి గార్డెన్లో ఏర్పాటు చేసిన పదవీ విరమణ కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగేశ్వర్ రావు, ఎంపీపీ మల్లికార్జున్తో కలిసి పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనిచేసే చోట మంచి గుర్తింపు తెచ్చుకుంటే విద్యార్థులు వారిని ఎప్పటికి మరిచిపోరన్నారు.

బురదమయంగా రోడ్లు


రాస్పెల్లి బారెగూడలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

- వీధి దీపాలు వెలుగక చీకట్లో పల్లెలు
- పట్టించుకోని ప్రత్యేకాధికారులు

కాగజ్నగర్రూరల్: ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గ్రామ పంచాయతీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. కానీ గ్రామాల్లో పంచాయతీ ప్రత్యేకాధికారులు పనులు చేపట్టడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. తొలకరి వర్షాలకే పల్లెల్లోని రోడ్లు బురదమయంగా మారాయి. ఆయా గ్రామాల ప్రజలు సమస్యలను ప్రత్యేకాధికారుల దృష్టికి తీసుకెళ్దామనుకున్నా వారు గ్రామాలవైపు కన్నెత్తి చూడకపోవడంతో సమస్యలతో సహవాసం చేయాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి.

పల్లెల్లో పలు సమస్యలు..

కాగజ్నగర్ మండలంలో 28 గ్రామపంచాయతీలు


కొత్త సారసాలలో వెలుగని వీధి దీపాలు

ఉన్నాయి. గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్తాచెదారం పేరుకుపోయి దర్శనమిస్తుంది. మురికి కాలువలు దుర్వాసన రావడం, వీధిలైట్లు వెలగకపోవడం, తాగునీరు సమృద్ధిగా రాకపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. కనీసం వీధుల్లో ఉన్న చెత్తను తొలగించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రాస్పెల్లి, సారసాల గ్రామపంచాయతీల్లో రోడ్లపైనే వర్షపు నీరు నిల్వ ఉంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

వెలుగని వీధిదీపాలు

గ్రామాల్లో వీధిదీపాలు వెలుగకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుంది. వర్షాకాలం కావడంతో పాములు, తేళ్ల బెడద తీవ్రంగా ఉంది. రోడ్లపైనే నీరు నిల్వ ఉండటం, చెత్తాచెదారం పేరుకుపోతుండటంతో పాములు, తేళ్లు ఇళ్లలోకి వస్తున్నాయని గ్రామీణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధిదీపాలు వెలుగకపోవడంతో రాత్రిళ్లు బయటకు వెళ్లలేని పరిస్థితులు నెలకొంటున్నాయని వారు వాపోతున్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయంతో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నామని వారు పేర్కొంటున్నారు.

పరిష్కారం లేదు..

ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన ప్రత్యేకాధికారులు గ్రామాలవైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. అయితే ప్రత్యేకాధికారులకు పంచాయతీల విధులతో పాటు పలురకాల విధులు ఉండటంతో వారు ఇటువైపు శ్రద్ధ పెట్టడం లేదు. దీంతో ఆయా పంచాయతీల పాలన కుంటుపడి ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోతున్నాయి. కనీసం మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించే నాథుడే కరువయ్యారు. గ్రామ సమస్యలు చెబుదామంటే ప్రత్యేకాధికారులు అందుబాటులో ఉండటం లేదని ప్రజలు వాపోతున్నారు.

నీరు నిల్వ కాకుండా చూడాలి



బారెగూడకు వెళ్లే ప్రధాన రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉంటుంది. దీంతో మోకాలు లోతు నీటిలో నుంచి వెళ్లాల్సి వస్తుంది. గతంలో ఎన్నోసార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. ఉన్నతాధికారులు స్పందించి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి.

– విశ్వనాథ్, బారెగూద, రాస్పెల్లి

వీధి దీపాలు అమర్చాలి



కొత్త సారసాల గ్రామంలో వీధి దీపాలు లేక ఇక్కట్లకు గురవుతున్నాం. మా గ్రామం అటవీ ప్రాంతానికి ఆనుకొని ఉండటంతో రాత్రిళ్లు పాములు, తేళ్లు సంచారం ఎక్కువగా ఉంటుంది. చేతిలో టార్చిలైట్ లేనిదే రాత్రిపూట బయటకు వెళ్లలేకపోతున్నాం. వెంటనే వీధి దీపాలు అమర్చాలి.

– పుల్ల శ్రీకాంత్, కొత్తసారసాల

చర్యలు తీసుకుంటాం

రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటాం. అధికారులకు గ్రామస్తుల సహకారం కూడా ఎంతో అవసరం. వీధి దీపాలు వెలుగని చోట కొత్తవి అమర్చుతాం. గ్రామస్తులు సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తాం.

– రమేశ్, ఎంపీడీవో, కాగజ్నగర్

అధికారులు అందుబాటులో ఉండాలి

- ఇన్చార్జి జెడ్పీ చైర్మన్ కృష్ణారావు
- ముగిసిన సర్వసభ్య సమావేశం

దహెగాం: ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అధికారులు అందుబాటులో ఉండాలని ఇన్చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. సోమవారం ఎంపీపీ కంబగౌని సులోచన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి జెడ్పీ చైర్మన్ కృష్ణారావు హాజరయ్యారు. ముందుగా ఆయా శాఖల అధికారులు నివేదికలను సభా ముందు చదివి వినిపించారు. పంచాయతీలలో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నందున సమావేశంలో సమస్యలను లేవనెత్తే వారు లేరు. దీంతో


మాట్లాడుతున్న ఇన్చార్జి జెడ్పీ చైర్మన్ కృష్ణారావు

సాదాసీదాగా సమావేశం ముగిసింది. అనంతరం కృష్ణారావు మాట్లాడుతూ ఐదేళ్లుగా ప్రజాప్రతినిధిగా ప్రజలకు సేవ చేశామని, మరో రెండు రోజుల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీ కాలం ముగుస్తుందన్నారు. అందరి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేశామని పేర్కొన్నారు. అధికారులు ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చూడాలని సూచించారు.

సన్మానం..

మండల ప్రజాప్రతినిధులకు మరో రెండు రోజుల్లో పదవీ కాలం ముగుస్తున్నందున ఎంపీడీవో రాజేందర్ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఇన్చార్జి జెడ్పీ చైర్మన్ కృష్ణారావు, జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు, ఎంపీపీ కంబగౌని సులోచనలతో పాటు ఎంపీటీసీలను శాలువాలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. సమావేశంలో ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

- ఎంపీపీ పెందోర్ మోతీరాం

కెరమెరి: మండల ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమైందని ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి, వైస్ఎంపీపీ అబ్దుల్ కలాం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 5న ఎంపీటీసీలు, జెడ్పీటీసీల పదవీకాలం ముగుస్తుండడంతో భావోద్వేగంతో మాట్లాడారు.


ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న అధికారులు

అంతకుముందు వివిధ శాఖల అధికారులు ఎజెండా అంశాలతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం సభ్యులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందించారు. ఎంపీడీవో అంజద్పాషా, తహసీల్దార్ దత్తు ప్రసాద్, మండల వ్యవసాయాధికారి గోపికాంత్, ఏఈలు నజిమొద్దిన్, విశ్వేశ్వరరావు, స్టీఫెన్, ఐకేపీ ఏపీఎం జగదీశ్వర్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, పశువైద్య సహాయాధికారి సానియా, విద్యుత్ సబ్ ఇంజనీర్ రమేశ్, ఐసీడీఎస్ సూపర్వైజర్ సూర్యకాంత, అధికారులు సుధాకర్రెడ్డి, ప్రసాద్, రాజేశ్గౌడ్, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

ఏరియాలో 112 శాతం బొగ్గు ఉత్పత్తి

రెబ్బెన: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్లో బెల్లంపల్లి ఏరియా 112 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఏరియా జీఎం రవిప్రసాద్ తెలిపారు. గోలేటి టౌన్షిప్లోని తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఏరియా సాధించిన ఉత్పత్తి వివరాలను తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ జూన్కు గాను ఏరియాకు 3 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా ఏరియా 3.36లక్షల టన్నులతో 112 శాతం ఉత్పత్తి సాధించిందన్నారు. కైరిగూడ ఓసీపీ ద్వారా మాత్రమే బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ కొనసాగుతుండగా ఈ సంవత్సరం చివరి నాటికి గోలేటి ఓసీపీలో బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభించేలా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి కొన్ని రకాల అనుమతులు రావాల్సి ఉందని వాటి కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. అన్ని పరిస్థితు


మాట్లాడుతున్న ఏరియా జీఎం రవిప్రసాద్

లు అనుకూలంగా ఉంటే ఈ ఏడాది చివరి నాటికి గోలేటి ఓసీపీలో బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ మొదలవుతుందని తెలిపారు. బెల్లంపల్లి ఏరియాలో హరితహారం కార్యక్రమాన్ని దిగ్విజయంగా చేపడుతామన్నారు. సింగరేణి ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటడంతో పాటు ఏరియాలోని ప్రజలకు సైతం మొక్కలను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో డీజీఎం ఐఈడీ ఉజ్వల్కుమార్ బెహెరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎల్కపల్లి వారసంత వేలం

పెంచికల్పేట్: ఎల్కపల్లి వారసంత వేలం మంగళవారం పంచాయతీ కార్యాలయంలో మధ్యాహ్నం 2గంటలకు నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి కుకిడే చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు పంచాయతీ కార్యాలయంలో డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

చేడ్వాయి వారసంత వేలం

మండలంలోని చేడ్వాయి వారసంత వేలాన్ని బుధవారం పంచాయతీ కార్యాలయంలో ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాధ ఒక ప్రకటనలో తెలిపారు.

సమస్యల్లో గిరిజన పాఠశాల


టార్పాలిన్పై కూర్చొని పాఠాలు వింటున్న విద్యార్థులు

- ఏళ్లుగా అసంపూర్తిగానే భవనం
- మౌలిక సదుపాయాల కొరత
- పట్టించుకోని అధికారులు

తిర్యాణి: అత్యంత వెనుకబడిన గిరిజనుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోంది. అందులో భాగంగా సకల సౌకర్యాలతో నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో గిరిజనుల కోసం ప్రత్యేకంగా గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలు నెలకొల్పింది. కానీ క్షేత్రస్థాయిలో అనేక పాఠశాలల్లో నేటికీ కనీస సదుపాయాలు కల్పించకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

అసంపూర్తి భవనం.. తప్పని ఇక్కట్లు

మండలంలోని ఉమ్మడి మంగి గ్రామపంచాయతీ పరిధిలోని తోయరిట్, బందూర్గూడ, ఇప్పలగూడ గ్రామాల్లోని విద్యార్థులకు విద్య అందించేందుకు తోయరిట్ గ్రామంలో గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల నెలకొల్పింది. ఈ పాఠశాలలో మూడవ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. కాగా పాఠశాల భవనం నిర్మాణం కోసం దాదాపు 17 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కానీ అప్పటి కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యంతో నేటికీ భవనం అసంపూర్తిగానే దర్శనమిస్తుంది. కాగా పాఠశాలలో రెండు


తరగతి గదిలో పాము పుట్ట

తరగతి గదులు నిర్మించగా వాటికి నేటికీ తలుపులు, కిటికీలు లేకపోవడంతో వర్షాకాలంలో వర్షం కురిసిన ప్రతీసారి పాఠశాలలోకి నీరు చేరుతోంది. దీనికి తోడు తరగతి గదుల్లో ఫ్లోరింగ్ చేపట్టకపోవడంతో టార్పాలిన్పై కూర్చొని విద్యార్థులు విద్యను అభ్యసించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతోపాటు పాఠశాలలో రెండు తరగతి గదులు ఉండగా ఒకే ఉపాధ్యాయుడు ఉన్నాడు. ఒక గదిలో సదరు ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తుండగా మరో గది ఏళ్లుగా ఖాళీగా ఉంటుంది. దీంతో ఆ గది విష సర్పాలకు అడ్డాగా మారింది. ఇప్పటికే గదిలో పాముల పుట్ట వెలిసింది. కాగా పాఠశాలలో తరుచూ పాములు కనిపిస్తున్నాయని, పాఠశాలలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక విద్యార్థులను బడికి పంపించాలంటే భయాందోళన చెందతున్నామని తల్లిదండ్రులు వాపోతున్నారు. దీనికితోడు పాఠశాలలో మంచినీటి సౌకర్యం లేకపోవడంతో దగ్గరలోని మంచినీటి బావి వద్దకు వెళ్లి దాహం తీర్చుకోవాల్సిన పరిస్థితి ఉంది.

టార్పాలిన్లపై కూర్చుంటున్నాం



మా పాఠశాలలోని తరగతి గదిలో ఫ్లోరింగ్ పనులు చేపట్టకపోవడంతో నేలపై టార్పాలిన్లు వేసుకొని కూర్చుంటున్నాం. బడిలో మంచినీరు లేకపోవడంతో బావి దగ్గరకి వెళ్లి నీరు తాగుతున్నాం. తలుపులు, కిటికీలు లేకపోవడంతో వర్షం కురిసిన ప్రతీసారి గదిలోకి నీళ్లు వస్తున్నాయి.

– సిద్ధు, విద్యార్థి

బడికి రావాలంటే భయం



పాఠశాలలో పాముల పుట్ట ఉండడంతో బడికి రావాలంటేనే భయమేస్తుంది. తరుచూ పాములు పాఠశాలలో సంచరిస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే భవన నిర్మాణ పనులు పూర్తి చేయించడంతో పాటు కనీస సౌకర్యాలు కల్పించాలి

– రాము, విద్యార్థి

వ్యర్థాలతో దుర్వాసన

- చికెన్, మెడికల్ వేస్టేజీతో ఇబ్బందులు
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న రైతులు

బెజ్జూర్: చికెన్ షాపుల యజమానులు, నాయీ బ్రాహ్మణులతో పాటు మెడికల్కు సంబంధించిన వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లి ఇబ్బందులు పడుతున్నామని మండలవాసులు, రైతులు వాపోతున్నారు. మండల కేంద్రంలో సేకరించిన చెత్తను పురాతన శ్మశానవాటిక దారిలో పడేస్తున్నారని, దీంతో చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మత్తడి స్ప్రింగ్ ఆనకట్టకు వెళ్లేదారిలో విరిగిన బ్లేడ్లు, సిరంజీలు, చికెన్, మటన్ వ్యర్థాలు పడేస్తుండడంతో దోమలు వృద్ధి చెంది అనారోగ్యం బారిన పడే ప్రమాదం లేకపోలేదని వాపోతున్నా


చికెన్ సెంటర్ నిర్వాహకులతో మాట్లాడుతున్న రైతులు

రు. సంబంధిత అధికారులు కల్పించుకొని ఈ ప్రాంతంలో చెత్త పడేయకుండా చూడాలని కోరుతున్నారు. దుర్వాసన కారణంగా చుట్టుపక్కల పొలాల్లో వ్యవసాయ పనులకు కూలీలు కూడా రావడం లేదని పేర్కొంటున్నారు. అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పందుల నివారణకు చర్యలు తీసుకోవాలి

రెబ్బెన: గోలేటిలో రోజురోజుకూ పెరుగుతున్న పందుల నివారణకు సింగరేణి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని గోలేటి మాజీ సర్పంచ్ పోటు సుమలత అన్నారు. గోలేటి టౌన్షిప్లోని జీఎం కార్యాలయంలో సోమవారం స్థానిక మహిళలతో కలిసి బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవి ప్రసాద్ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగులు నివాసం ఉండే కార్మిక కాలనీలతో పాటు దుబ్బగూడ, భగత్ సింగ్నగర్ వంటి ప్రాంతాల్లో పందుల స్వైర విహారం రోజురోజుకు పెరుగుతుందన్నారు. దాంతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. పంచాయతీ ప్రజలు, సింగరేణి ఉద్యోగుల సంక్షే


జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న సుమలత

మాన్ని దృష్టిలో ఉంచుకొని సింగరేణి యాజమాన్యం పందులను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్లో సోమవారం డాక్టర్స్ డే ఘనంగా జరుపుకున్నారు. మంచిర్యాల విభాగ్ అధ్యక్షుడు డాక్టర్ విష్ణువర్ధన్ రావును పాఠశాల ప్రబంధకారిణి కార్యదర్శులు కొడిప్యాక వేణుగోపాల్, నాగుల శ్రీనివాస్, విభాగ్ కార్యదర్శి దహెగాం గోవింద్రావు శాలువాతో సన్మానించారు. అనంతరం అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు


సన్మానిస్తున్న శిశుమందిర్ ప్రతినిధులు

ప్రదానం చేశారు. అకాడమిక్ ఇన్చార్జి పూదరి సత్యనారాయణ, కమిటీ సభ్యులు కల్లూరి సంతోష్, శ్రీనివాస్, ఆచార్యులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

వాంకిడి: 'చినుకు పడితే చీకటే' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు సోమవారం స్పందించారు. ఖమాన గ్రామంలోని ఎస్సీ కాలనీలో గల కరెంటు స్తంభం వద్ద విద్యుత్ వైర్ల మధ్య నుంచి ఎగబాకిన చెట్ల కొమ్మలను తొలగించారు. కథనానికి స్పందించిన ఏఈ శ్రీకాంత్ మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని 33,11 కేవీ లైన్లకు అడ్డుగా పెరుగుతున్న చెట్ల కొమ్మలు, తీగజాతి మొక్కలను ముందస్తుగా మేలో తొలగించినప్పటికీ కొన్నిచోట్ల త్వరగా పెరిగినట్లు పేర్కొన్నారు. 33 కేవీ లైన్లో డ్యామేజ్ అయిన పోల్స్ తొలగించామన్నారు. మే, జూన్లలో ఈదురుగాలులు, పిడుగులతో ఇన్సులేటర్లు, ట్రాన్స్ఫార్మర్లు కాలిపోయాయని, అన్నింటిని సరిచేశామన్నారు. విద్యుత్ లోడ్ నివారణలో భాగంగా మండలంలోని 19 గ్రామాల్లో ఇప్పటికే 20 నూతన ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేశామని, ఇంకా 10 ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. 28 మంది లబ్ధిదారులకు 9 ట్రాన్స్ఫార్మర్లు బిగించినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా తమ సిబ్బంది నిరంతరం, అప్రమత్తత, నిబద్ధతతో పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ మరమ్మతుల సమయంలో వినియోగదారులు సహకరించాలని కోరారు.


ఖమాన గ్రామంలో స్తంభం వద్ద తొలగించిన మొక్కలు

వీధిదీపాలు ఏర్పాటు చేయాలి

వాంకిడి: మండలంలోని బెండార గ్రామంలో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గొడిసెల కార్తిక్ డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో గ్రామాల్లో చేపడుతున్న యూత్ సర్వేలో భాగంగా సోమవారం మండలంలోని బెండార గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధులలో తిరుగుతూ సమస్యలు తెలుసుకున్నారు. వర్షాకాలంలో వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు అధికంగా ఉన్నందున అధికారులు పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. మురికి కాలువల్లో చెత్త తొలగించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దుర్గం నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు